# వియ్యాన్న తాత మరణం

చివరికి మా వియ్యాన్న తాత ఇల్లా చచ్చిపోతాడని ఎవరూ అనుకో లేదు. ఆయన ఏ పని చేసినా అందరిలా చేయడు. కాని ఆయన అందరిలాగే చచ్చిపోయాడు. ఆయన చచ్చిపోయే సమయానికి, ఆయనలోంచి మా అసలు తాత లోపించాడు. లేక కొన్నిగంటల ముందుగా చచ్చిపోయాడు. మా అంలు తాత మాత్రం ఇల్లా చచ్చిపోడని మా అందరికీ గట్టి నమ్మకం.

రత్తి - అంటే మా తాత ఉంచుకొన్న ఈడిగది - ఆవేళ ప్రొద్దున్నే లేచి పాలు పితుక్కురావడానికి పొలం వెళ్ళింది. తిరిగి వచ్చేసరికి ఏడుగంటల వరకూ అయింది. తాత ఇంకా లేచిన జాడ లేకపోవడం మూలాన్ని విసుక్కుంటో తలుపుతోసి లోపలికి వెళ్ళింది. నేను అదే సమయానికి కాల కృత్యాలు తీర్చుకోడానికి కాలవగట్టుకి పోతున్నాను. రత్తి గొంతు కోపంగా చిరాకుగా లోపలినించి వినబడుతోంది.

"లే! ఇంకా ఏం పడక, పొద్దోయింది"

.... .... .... ....

"రోజూ ఇంతే. ఇంకా నిద్దరే...."

రత్తి గొంతు మారింది. "తాతా!....తాతా! తా...." ఆమె నే నెప్పుడూ వినని ధ్వని ఏదో చేసింది. నేను తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాను.

నన్ను చూచి రత్తి చెప్పబోయింది, "తా....త!"

రత్తి ఏడవలేదుగాని ఏడిచినంత పని చేసింది-అసలు రత్తి ఎప్పుడూ ఏడవదు. ఆమె ఎప్పుడూ నవ్వలేదుగాని ఎప్పుడూ ఏడవనూ లేదు. మహా మహా సంతోషాలలో ఆమె నవ్వనూలేదు, మహా మహావాళ్ళు పోయినా ఆమె ఏడవనూ లేదు. అంటే మా తాత మహామహా వాళ్ళలో లెక్కకాదని గాని, రత్తికి మా తాతమీద ఏడుపు వచ్చేటంత మమకారం ఏమీ లేదనిగాని అర్థంకాదు.

మా తాత అనడంవల్ల మీరు కొంతవరకూ పొరబడి వుంటారు. ఆ మాటకొస్తే ఆయన ఎవరికీ తాత కాడు. ఆ పై మాటకొస్తే ఆయన అందరికీ తాతే. ఎవరెవరికి 'తాత' ఎల్లా ఉంటాడో వారికి ఆయన అల్లా అగుపిస్తాడు. తాతల జాతికి ఒక నిర్వచనం ఆయన. అంతా ఆయన్ని తాత గానే ఎరుగుదురు. ఆయన్ని ఇంక ఎలా పిలవాలో ఎవరికీ తెలియదు. చివరకి రత్తి కూడా ఆయన్ని 'తాత' అనే పిలిచేది.

అసలు మా తాత చచ్చిపోవడం మొదలుపెట్టి పదిహేను సంవత్సరా లయింది. ప్రతీ ఏడూ ఆయన ఒకసారయినా చచ్చిపోతూనే వచ్చాడు. కాని మళ్ళీ ఏడు చచ్చిపోవడంకోసం బతుకుతూనూ వచ్చాడు. అందుకని

మా ఊరి వారంతా ఆయన చచ్చిపోడని నిరాశపడి పోయారు. ఈసారి మాత్రం ఆయన మళ్ళీ బతకకుండా చనిపోయాడు.

వియ్యన్న తాతకి బతుకులో ఎంత నమ్మకం లేకపోయినా చావులో అంతకంటే నమ్మకం లేదు. చావుని గురించి ఎవరికీ ఏమీ తెలియదు. బతుకుని గురించి కొంత కాకపోతే కొంతయినా అందరికీ తెలుసును. అంచేత తెలియని చావు చచ్చిపోడంకంటే తెలిసిన బతుకు బతకడమే మంచిదని ఆయన వాదం. చావే మంచిదయితే ప్రపంచకమంతా ఒక్కసారిగా యెందుకు చచ్చిపోదు ?

మా ఊరి వారంతా ఆయనను కేవలం అపాయకరమైన మనిషిగా పరిగణించడం కొద్దిరోజుల క్రితమే మొదలుపెడతా.

సాధారణంగా పల్లెటూళ్ళ పెద్దలందరికీ ఉంపుడు కత్తెలుంటారు. ఉంచుకున్న వాళ్ళంతా పెద్దలు కాకపోయినా, పెద్ద లందరికీ ఉంపుడుకత్తె లుంటారు. అదొక గౌరవం. కాని మా వూళ్ళో ఒక పెద్దమనిషికి మాత్రం ఉంపుడు కత్తె లేదు. అట్టే చదువుకోకపోయినా, ఇతరచోట్ల ఉన్న ఆయన బంధువులంతా చదువుకున్న వాళ్ళవడంచేత, లోకంలో సంగతులు అందరి కంటే ఆయనకు బాగా తెలుసును. ప్రతిరోజూ పత్రిక చదివి ఊళ్ళో పెద్ద లందరికీ వ్యాఖ్యానంచేసి చెపుతూ ఉంటాడు. ఆయనకు ఉంపుడు కత్తె లేని కారణంచేత ఆయన ప్రత్యేకతని మా ఊరి పెద్దలంతా ఆమోదించారు. విధవా వివాహాలు మొదలయిన సంస్కారాల అంతరార్థం — ఆయన తన విధవ కుమార్తెకు వివాహం చెయ్యకపోయినా — అప్పుడప్పుడు ఆయన ఉపన్యాసాలుగా చెపుతూ ఉండేవాడు. ఇంకా అనేక విషయాలను గురించి ఆయన తర్కించి చెపుతూ ఉండేవాడు. ఇన్ని తెలిసీ కూడా ఆయన తన కుమార్తెకు విధవా వివాహం చెయ్యకపోవడమే మా ఊరి వారందరికీ

ఆయన యందున్న గౌరవానికి కారణం. ఇంకో కారణం కూడా వుంది- స్త్రీ పురుష సాంగత్య విషయమయి కొంతవరకూ స్వాతంత్ర్యం వుండ వచ్చునని, ఉంపుడుకత్తె లుండడం అంత పాపం కాదని, వివాహం ఎంత పవిత్రమయినదయినా ఇంత మాత్రాన్ని అపవిత్రమయిపోదని ఆయన నచ్చ చెప్పాడు. ఇంతవరకూ ఇది పాపంగా పరిగణించి కూడా, ఈ అలవాటు వదలి పెట్టలేని మా ఊరి పెద్దలంతా మనస్సులు తేలిక చేసుకుని సమాధాన పడేవారు. ఇంత తెలిసీ కూడా ఆయన ఎవరినీ ఉంచుకోకపోవడంచేత వారంతా ఆయనను మరింత భక్తిశ్రద్ధలతో చూసేవారు.

ఆయన ఒకనాడు మా తాతగారి ఇంటికి వచ్చి, మా తాతని వాళ్ళింటికి భోజనానికి పిలిచారు. మా తాతని, ఎవరయినా తోడి బ్రాహ్మణులు భోజనానికి పిలవడానికి అదే మొదటిసారి. మా తాతకి కొంత చిత్రంగా అనిపించింది.

"ఏం?" అని గద్దించి అడిగాడు.

"అబ్బే! మా నాన్నగారి ఆబ్దీకం. మీరిల్లా మా లోంచి విడిపోయి ఉండడం నాకు నచ్చలేదు.... చాలా రోజులబట్టి అనుకుంటున్నాను పిలుద్దా మని."

"అయితే ఎందుకు మానేశావు?"

ఆయన గొంతుక సవరించుకొని నెమ్మదిగా అన్నాడు: "నాకు పెద్ద తేడాలు లేవు సుమండీ, ఎవరి యిష్టం వారిది, ఎవరి అలవాట్లు వారివి. అంత మాత్రంచేత...." ఆయనకు ఏమనాలో తోచలేదు.

"నేను చెపుతాను విను. నువ్వేదో మెహర్బానీకోసం నన్ను పిలవ డానికి వచ్చావు. అలవాట్లంటే చెపుతున్నాను. నాకు ఒకరి ఇంటికి వెళ్ళడం అలవాటు లేదు. నువ్వనేది రత్తిని గురించి...."

"అబ్బే! తాతగారూ! అది కాదండోయి. నా కటువంటిదేమీ లేదు. మీ ధైర్యం చూస్తే నాకు గౌరవం కూడాను. అబ్బే! అదేం పెద్ద తప్పా?"

"తప్పు కాకపోతే నువ్వెవరినయినా ఎందుకు ఉంచుకోలేదు? వెర్రి వేషాలు నా దగ్గర తీసెయ్యి మరి! నా ఇష్టం నాది. పెద్ద తప్పో ఒప్పో నీ ఒప్పుదల నాకు కావాలి గావును?"

వచ్చిన పెద్దమనిషి హడిలిపోయి వెళ్ళిపోయాడు.

ఉంచుకున్న వాళ్లెంతోమంది ఉన్నా బహిరంగంగా ఉంచుకోవడం మామూలు లేదు. అందరికీ ఆ సంగతి తెలిసేఉన్నా పైకి యేమీ యెరగనట్టు అంతా నటించడం మామూలు. ఆ మామూలుకి భిన్నంగా వియ్యన్న తాత బహిరంగంగా రత్తిని ఇంట్లో ఉంచుకోడం అందరికీ గుటకపడడం లేదు. ఆ విషయమయి పైకి ధైర్యంగా మాట్లాడడము అంతకంటే గుటకపడడం లేదు. అందుకని ఆయనను అపాయకరమయిన మనిషిగా పరిగణించడం మొదలుపెట్టారు. తల్లిదండ్రులున్న కుర్రవాళ్ళు తాత ఇంటికి రావడం మానివెయ్యవలసి వచ్చింది.

మా వియ్యన్న తాత నిజంగా "చచ్చి"పోయిన ఘట్టం ఆయన చెపుతూ ఉంటేనే వినాలి. కాని అప్పు డాయన నిజంగా చచ్చిపోలేదు.

ఆయన అప్పుడప్పుడూ అంటూ ఉండేవాడు: "ఒరేయి! నే నసలు నెమలివంటి వాణ్ణిరా!" అని.

కాని అది వట్టి కోత. ఆయనకు వ్యభిచార మొక అలవాటు గాదు. ఆయన ఎన్నడూ బోగంవాడలో అడుగు పెట్టలేదు. అయినా ఆయనలో ఓ తీవ్రత వుండేది. ఆయన జీవితంలోని ప్రతిఘట్టం విడివిడిగా ఆలోచించవలసిందే. అందులో ముఖ్యంగా రత్తితో మొదటి స్పర్శ.

రత్తికి చరిత్ర చాలా వుంది. ఆమె, అన్నగారు తలిదండ్రులులేని పిల్లలు. వయస్సు వచ్చిన రత్తికి పెళ్ళి ప్రయత్నాలు సకాలంలో జరగలేదు. సహజంగా ముభావంగా, పెంకిగా, అస్పృశ్యగా ఉండే స్వభావమయినా వయసు దాని కొంటెతనాన్ని ధృవపరచుకుంది. ఒక కండలుదేరిన ఈడిగ స్నేహితుడు రంగూన్ వెడుతూ ఉంటే, ఆమె అదో మోస్తరుగా అతనివేపు చూచి చిరునవ్వు నవ్వింది. నవ్వి తనుకూడా అతనితో రంగూన్ వెళ్ళి పోయింది. తరవాత కొన్ని నెలలకు రంగూన్‌లో ఎంత వెదికినా అతడు కనబడకపోతే ఆరు నెలల కడుపుతో ఇంటికి తిరిగి వచ్చింది. అన్నగారు తిట్టి కొట్టాడు. ఆమె ఏడవలేదు. ఎదురు తిరగలేదు. ఒక వైద్యుడిచేత అన్న గారు మందు పెట్టించాడు. కడుపు పోయిందిగాని ఆమె గుడిసె అవతల వచ్చే పోయ్యే ఊపిరితో నాలుగు రోజులుంది. తరువాత నిలబడి లేచింది. ఇదంతా సహజంగా జరగవలసిన కర్మకాండగానే ఆమె భావించుకుంది. ఆమె ఎవరినీ ఏమీ అనలేదు. కాని తనవేపు అదో మోస్తరుగా చూసే వయసు గాళ్ళమీద ఉరువెత్తుగా లేచి కొట్టినంతపని చేసేది. ఆ రోజు మొదలు ఆమె ఏడవనూ లేదు, నవ్వనూ లేదు, ఇంకా ఏ మగవాడికేసీ అదో మోస్తరుగా చూచి చిరునవ్వు నవ్వనూ లేదు.

తరువాత రత్తి మా వియ్యన్న తాత ఇంట్లో దాసీగా కుదిరింది. క్రమంగా ఆమె తేరుకుని రంగూన్ వెళ్ళిన నాటికంటే నిగనిగలాడే రొమ్ములు పెంచుకుంది. ఆనాటికంటే నున్నని చేతులు పెంచుకుంది. కాని వయస్సు మాత్రం దాని కొంటెతనాన్ని ధృవపరచుకోలేకపోయింది. ఆమె దోర నిమ్మకాయలా ఉండేది. కాని ఆమె ముఖం చూస్తే సూటిగా ముల్లు కరవడానికి సిద్ధంగా వుండేది. మా వియ్యన్న తాత పెళ్ళాం కొడుకూ బ్రతికున్నరోజు లవి.

సహజంగా నెమలివంటి మా వియ్యన్నతాత, ఒకనాడు ఆమె ఇల్లు

ఊడుస్తోంటే అదో మోస్తరుగా చూశాడు. ఆమె ఉరిమింది. కొంచం భయ పడ్డా నెమ్మదిగా ధైర్యంచేసి దగ్గరగా వెళ్ళి గొంతుకలో అణిగిపోయే స్వరంతో "రత్తీ" అన్నాడు.

ఆమె నిలువునా లేచి పెడేలుని లెంపకాయ కొట్టింది. ఆ సాయం కాలమే పని మానేసింది.

తరువాత కొన్నాళ్ళవరకూ వియ్యన్న తాత రత్తి సంగతి మరచి పోయాడు. రత్తికి బదులు ఇంకో దాసీ వచ్చినా ఆమెచేత వియ్యన్నతాత లెంపకాయ తినలేదు.

మా వూళ్లో కలరా వచ్చింది. సరే మా వియ్యన్న తాతకి వచ్చింది. ఒక రోజుని ఆయనకి స్పృహ తప్పింది. ఆయనకి మళ్ళీ స్పృహవచ్చే లోగా కొడుక్కి కలరా రావడం 'చచ్చిపోవటం కూడా జరిగాయి. మొదట తను చచ్చి బతికిన సంగతి గ్రహించిన తరువాత కొడుకు చచ్చి బతకలేదన్న సంగతి నెమ్మదిగా గ్రహించాడు. కానీ ఆయనకి వెంటనే కోపమూ రాలేదు, దుఃఖమూ రాలేదు, ఉత్త ఆకలి వేసింది. అయినా నాలుగురోజులు పోయేదాకా వైద్యుడు పత్యం పెట్టనీయలేదు. మొదట ఆకలి తీరిననాడు ఆయనకు రాకపోతే బావుండదని ఏడుపు వచ్చింది. 'నేనన్నా చచ్చిపోయాను కాదు!' అంటూ ఏడిచాడు. అయినా ఎందుకో తను చచ్చిపోనందుకు కొంత సంతృప్తి పడ్డాడు.

ఒక యిరవయి రోజులు గడిచాయి. ఇంక కలరా ఊళ్లోంచి వెళ్ళి పోతోందని అంతా అనుకుంటున్నారు. అందరూ అనుకున్నట్టు ఎందుకు వెళ్ళిపోవాలని గావును, చటుక్కున వెనక్కి తిరిగివచ్చి కలరాకన్న తాత పెళ్ళాన్ని పట్టుకుంది. నాలుగు రోజులు పోయిన తరువాత ఐదోనాడు సాయంకాలానికి కొంత తగ్గినట్టు కనబడింది. అప్పటికి వియ్యన్నతాత బాగా

కోలుకున్నాడు. తనే ఇంట్లో వంటా అదీ తంటాలుపడి చేసుకునేవాడు అల్లాగే విసుక్కుంటూ అడిగినప్పుడు భార్యకు మంచినీళ్ళ వగైరా ఇస్తూ ఉండేవాడు.

నాలుగురోజులు శ్రమపడ్డ కళ్ళకి కొంత మగతనిద్ర పట్టింది. కలలో వాళ్ళబ్బాయి పళ్ళన్నీ కనబడేటట్టే నవ్వాడు. 'వెధవా! ఉండు' అనబోయి మళ్ళీ జంకాడు. ఇంటి కప్పులోంచి విమానం వెళ్ళిపోతూ అతన్ని చూచినట్టు, ఆకాశం చిల్లుపడి పెద్దప్రవాహం తిమింగలాలవంటి చేపలతో భూమి మీద పడ్డట్టూ, అందులోంచి చమికీదుస్తులు వేసుకున్న రాజు, మంత్రీ దిగినట్టూ, ఇంకా ఏవేవో కనబడ్డాయి. ఇంతలో దెయ్యాలు దెబ్బలాడు కుంటున్నట్టు గొణగొణ. వియ్యన్నతాత చటుక్కున లేచాడు.

దీపం ఆరిపోయింది. మంచం దగ్గరగా వెళ్ళాడు. గొణగొణ మాట్లాడుతోంది మంచం. ఆయన రోగిని కదిపి పలకరించాడు. ఆమె "ఊ!" అని మళ్ళీ గొణగొణ ప్రారంభించింది. "ఏమిటీ వెర్రివేషాలు?" అనుకున్నాడు వియ్యన్న తాత. తలుపేపక్కనో తెలియక మంచం పక్కని చతికిలబడ్డాడు. మంచం కొంచెం వణికింది. ఆయన అదిరిపడి రోగిమీద చెయ్యి వేశాడు. రోగి వడవడా ఒణుకుతోంది. చటుక్కుని చెయ్యి తీశాడు. గొణగొణ ఆగిపోయింది. కీచురాళ్ల 'కంయ్యి!' మని శృతి ఎక్కించాయి. చీకటిలో ఏదో తొందర తొందరగా ఉంగలు చుట్టుకుపోతోంది. ఏమిటిదంతా? అనుకున్నాడు వియ్యన్నతాత. ఇంతలోకే ఏదో టక్కున ఆగిపోయింది. చూస్తే రోగి వణుకు. మెల్లిగా పిలిచాడు. జవాబురాలేదు. గట్టిగా పిలిస్తే ఏం ప్రమాదమోనని పిలవలేకపోయాడు. మెల్లగా గురక వినబడింది - ఆగి ఆగి కోస్తున్న రంపపు కోతలాగ. వియ్యన్నతాత గుండెలు ఎందుకో చటుక్కుని చల్లబడిపోయాయి. నీటిలో మునిగిపోయేవాడిలా ఆ చీకట్లో

గింజుకుని గింజుకుని చివరికి తలుపులు తెరుచుకుని ఇవతలకి వచ్చాడు. వెనకాల ఏదో తరుముకు వస్తున్నట్టు ఉలిక్కిపడ్డాడు.

ఊరు వదలి పొలాలవేపు నడిచాడు. తలదిమ్ము చీల్చి ఆలోచనలు ఇవతలికి లాగాలని ప్రయత్నిస్తూ నడిచాడు. పొలాలు, చెట్లు, అన్నీ నల్లగా ఉన్నాయి. దిక్కు తెలియకుండా గట్ల వెంబడి నడిచాడు. చెట్లు తల విర బోసుకున్న పెద్ద అమ్మవార్లలా ఉన్నాయి. చటుక్కుని బోదెలలో నీరు పాకుతున్న పాములా తళుక్కుని మెరుస్తోంది. అక్కడక్కడ దూడలు నిద్రని నెమరువేస్తూ సోమరిగా పడుకున్నాయి. గీసిన గెలలోంచి కుండమూతి తొలిగి కల్లు చుక్కలు చుక్కలుగా ఓ తాడిచెట్టు మీదనించి రాలుతోంది. ఓ బొట్టు తియ్యగా, కొత్తగా వియ్యన్న తాత ముఖంమీద రాలింది. 'ఛూ!' అన్నాడు.

"ఎవరదీ?" ఒక ఆడగొంతు పిలిచింది.

"ఛూ!" అన్నాడు మళ్ళీ తాత.

"మాట్టాడరేం? ఎవరదీ?"

పక్కని ఓ మెరకమీద గడ్డి పరుపు మెదలి చప్పుడయింది. కట్టుచీర సర్దుకుంటూ ఎవరో లేచి దగ్గరగా వస్తోంది.

"ఏం?" అన్నాడు వియ్యన్నతాత.

"ఎవరదంటే?"

"నేను"

"ఎవరూ? తాతగోరా?

కాని వియ్యన్న తాతకి ఆడగొంతు ఆనమాలు తెలియలేదు. అతడు దెబ్బతిన్నపక్షిలా నేలమీద చతికిలబడిపోయాడు. ఆమె చటుక్కుని దగ్గరగా వచ్చి "అయ్యా!" అంటూ పట్టుకుంది.

'కాలు జారిందిలే, ఒదిలెయ్యి; పరవాలేదు' ఈ చీకటి మధ్య నిద్రలేచి వచ్చిన బతికున్న ప్రాణిని చూస్తే తాతకి చిరాకు వేసింది. ఆమె స్పర్శ అతనికి గాడుపులా తగిలింది. వెంటనే విడిపించుకుని పోవాలనుకున్నాడు. ఆమె ప్రశ్నలకి సమాధానములు అతనికి తోచలేదు.

"ఇల్లా వచ్చారేం? ఇంతరాత్రి?"

"బయటికి." ఆమె మీదపడి గొంతుక నొక్కేద్దామనిపించింది. కాని చటుక్కని అతని నరాల్లో బలం అంతరించిపోయింది. అల్లాగే చతికిలబడి కూర్చున్నాడు.

"ఈ పక్క కొచ్చారేం? ఏటండీ?"

"అబ్బ! ఆలోచించుకోనియ్యి. ఏవో నిద్రలో కలలు వచ్చాయి...... ఇదే పక్క"

"పడమటి పొలం"

"అయితే నేను డాము దాటానా?"

"మీరేదో కంగారుపడ్డారుండీ"

వియ్యన్నతాత మెల్లగా ఆలోచించుకున్నాడు. ఆయనకి డాము దాటిన సంగతి నెమ్మదిగా జ్ఞాపకం వచ్చింది. క్రమంగా ఇందాకటినించీ మాట్లాడుతున్న మనిషి జ్ఞాపకం వచ్చింది. గొంతుక ఎప్పుడో విన్నదే. "రత్తీ!" అన్నాడు చటుక్కని.

"మీ కింతవరకూ గుర్తురాలేదో!" అంది రత్తి. తాత లేచి నిలబడ్డాడు.

"అమ్మగారి కెల్లాగుంది?"

చటుక్కని ఇల్లు జ్ఞాపకం వచ్చింది. ఆ గురక, వణుకు అన్నీ, ఒక్కసారి మనస్సంతా జల్లుమంది.

"బాగానే ఉంది. రేపు పథ్యం పెడతా."

చీకట్లో ప్రాణం గింజుకున్నట్టు అనిపించింది.

"రత్తీ!" అన్నాడు.

రత్తి బోది దాటి అవతలకి వెళ్ళింది. తాతా బోది దాటాడు. ఆమె కాసుకుని నిలబడింది. తాత అమాంతంగా ఆమెను కౌగలించు కున్నాడు.

"ఉండండీ" అంటూ ఆమె కొంత గిజగిజలాడింది. కాని ఎందుకో గట్టిగా కేకలు వెయ్యలేదు. తాతలో ఏదో జంతువు ప్రకోపించింది. ఆమెలో పెంకితనం కొంత సేపు పెనగులాడింది. కాని ఇన్నాళ్ళూ అణిగిపోయిన ఆమె శరీరపు నిగనిగ తన బలాన్ని మళ్ళీ రెండోసారి ధృవపరుచుకుంది. ఆమె ఆయాసంతో లొంగిపోయింది.

వేగుచుక్క పొడిచేదాకా తాత కోలుకోలేదు. చటుక్కని అతనికి ఏడుపొచ్చింది. "రత్తీ!" అన్నాడు.

"తాతగారూ!" అంది ఆమె.

అతడు గొంతుక సర్దుకుని నిర్లక్ష్యంగా అన్నాడు. "మా ఆవిడ ఈ పాటికి చచ్చిపోయి ఉండొచ్చు."

"ఆఁ!" అంది ఆమె ఆశ్చర్యంగా.

"అయ్యో తాతగారూ! నడండీ"

తాత కీసారి ఇల్లంటే భయం వెయ్యలేదు. అతని కేదో పెద్ద బరువు దిగిపోయినట్టు అయింది. ఎందుకంటే ఆయన కూడా అప్పుడు చచ్చిపోయాడు గనక!

అప్పుడే ప్రాణం పోయిన మంచానికి ఇటూ అటూ రత్తీ, వియ్యన్న తాత తెల్లవారిందాకా కూర్చున్నారు.

రత్తి మాత్రం చచ్చిన శవాన్ని చూడలేదు. ఆశ్చర్యంగా వియ్యన్న తాత వేపు చూస్తూ కూర్చుంది. ఎంత పశువులా అయిపోయాడు తాత ఆ రాత్రి! కాని ఆ రాత్రి ఆమెకు తాతమీద అపరిమితమయిన గౌరవం, అనురాగం కుదిరాయి. అతన్ని ఆ రాత్రి ఆమె మెచ్చుకుంది.

తాత ఆ రాత్రి చచ్చిపోయాడు. కాని రత్తి మూలాన్ని బతికాడు. ఇంతకీ చెప్పవచ్చేది మా తాతది చాలా గట్టి ప్రాణం. చివరికి ఇంత సులువుగా ఎవరికీ తెలియకుండా పోతాడని ఎవరనుకుంటారు?

('కథావాహిని' పద్మరాజు కథా సంకలనం

సం. గద్దె లింగయ్య, 1954)